క్లుప్తంగా

వేలంపాట వాయిదా

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ, వివిధ దుకాణాల కోసం మంగళవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. అయితే పాటదారులు ముందుకు రాకపోవడంతో ఈనెల 13వ తేదీకి వాయిదా వేసినట్లు ఉపకమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్యపై విచారణ



విచారణ జరుపుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన కౌలు రైతు రామానాయుడు అప్పుల బాధ తాళలేక నాలుగు రోజుల క్రితం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ ఇమ్రాన్, వీఆర్వో నాగముద్దిలేటి గ్రామానికి చేరుకుని ఆత్మహత్యపై విచారణ జరిపారు. కౌలు రైతు రామానాయుడు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు? పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఎంత మేరకు అప్పులు చేశారు? ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రైతు ఆత్మహత్యపై తుది నివేదికను ఆర్డీఓ కార్యాలయానికి నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి



ఆర్‌బీకే రంగాపురం గ్రామంలో ఈకేవైసీ చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

బేతంచెర్ల: మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదుతో పాటు ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదుతో ప్రభుత్వం నుంచి రాయితీలు, నష్టపరిహారం, రుణాలు అందుతాయని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోద, వైష్ణవి పాల్గొన్నారు.

ముమ్మరంగా శానిటేషన్ పనులు



వేరువీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

అవుకు: కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో అవుకు మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలో శానిటేషన్ పనులను ముమ్మరంగా చేశారు. మంగళవారం అవుకులోని తెలుగుపేట, ఎస్సీ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, ముస్లిం వీధితో పాటు పలు కాలనీల్లో పేరుకుపోయిన బురదను తొలగించి శుభ్రం చేశారు. అలాగే వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలను అరికట్టడానికి వీస్ ఆయిల్ చల్లారు. వీధుల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకుని అపోహలపై గ్రామస్తులకు తెలియజేయాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిదాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎయిడ్స్‌పై అవగాహన లేకపోవడంతో ప్రజలు హెచ్‌ఐవీ బారిన పడుతున్నారన్నారు. విద్యార్థులు గ్రామీణ ప్రజలకు ఈవ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, సుభాన్ రెడ్డి, పుల్లయ్య, కృష్ణయ్య, డీఏపీఈయూ సమన్వయకర్త సుబ్బరాయుడు, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కోవెలకుంట్ల: పట్టణంలో ఇటీవల లైంగిక దాడికి గురైన మానసిక దివ్యాంగురాలైన బాలిక కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం జేఏసీ నాయకుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధులను కఠినంగా శిక్షించాలని, దివ్యాంగుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బాలిక కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, బాలిక వైద్యానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో భద్రం

- తడిచేతులతో తీగలు, స్విచ్‌లు తాకొద్దు
- సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయడం ప్రమాదకరం
- వైర్లు తెగిపడి ఉంటే 1912కు సమాచారం ఇవ్వాలి
- నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడాలి
- విద్యుత్ అధికారుల సూచనలు



ఆకుమల్ల సబ్‌స్టేషన్

సంజామల: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ముప్పు పొంచి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. వర్షంలో వైర్లు తెగపడినట్లు కనిపిస్తే దగ్గరకు వెళ్లకపోవడం ఉత్తమం. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మీ పరిధిలోని విద్యుత్ సిబ్బంది సెల్ నంబర్లు దగ్గర ఉంచుకోవాలి.
- వీధులు, పొలాల్లో తడిచిన స్తంభాలు ముట్టుకోవద్దు.
- తోటలు, పొలాలు ఇతర ఏ ప్రదేశంలో అయినా విద్యుత్ తీగలు తెగపడి ఉంటే నేరుగా తాకరాదు. వెంటనే 1912కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.
- విద్యుత్ తీగలు చెట్టు కొమ్మలకు తాకి ఉంటే ఆ చెట్టును ముట్టుకోవద్దు. ఆ చెట్టుకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంది.
- వర్షం పడుతున్నప్పుడు తడిగా ఉన్న చేతులతో స్విచ్‌లు వేయొద్దు. విద్యుత్ తీగలపై బట్టలు ఆరవేయరాదు.
- కరెంట్ పనులు అనుభవం ఉన్న వ్యక్తితో చేయించుకోవాలి.
- వర్షం పడుతున్నప్పుడు ఇంట్లో కరెంట్ పోయిందని, సొంత ప్రయోగాలు చేయొద్దు.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే కరెంట్ సరఫరా నిలిపివేయాలి. తర్వాత కరెంట్ వైర్లు, షాక్‌తో ఉన్న వ్యక్తిని ప్లాస్టిక్ కర్రతో, లేక ఎండు కర్రతో వేరు చేయాలి. అనంతరం విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి.
- వర్షం పడుతున్నప్పుడు సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడితే ఆ ప్రదేశానికి వెళ్లకుండా వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలి.


జాగ్రత్తలతో ప్రమాదాలను అరికట్టాలి



వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలను సులభంగానే నివారించుకోవచ్చు. వర్షాకాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. వీధుల్లో గాలి వర్షానికి తీగలు తెగిపడితే వెంటనే మాకు సమాచారాన్ని అందించాలి. మరమ్మతులు చేస్తాం. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

–దుర్గ శ్రీనివాస్, విద్యుత్ ఏఈ సంజామల

ఎస్సార్బీసీ కాలువలో వ్యక్తి గల్లంతు



మహబూబ్ బాషా(ఫైల్)

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామతీర్థానికి చెందిన షేక్ మహబూబ్ బాషా (45) రెండు రోజుల క్రితం ఎస్సార్బీసీ కాలువలో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. భార్య మాసుంబీ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

బనగానపల్లె రూరల్: బాలిక విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని జేసీఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేసీసీస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామంలో టీడీయూపీ, ఉర్దూ పాఠశాలల్లో విద్యాసంస్థల బోర్డ్ మండలి సహకారంతో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బాలికలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. బాల్య వివాహాలతో వారి జీవితాలను నాశనం చేయొద్దని కోరారు. హెచ్‌ఎంలు రమాదేవి, రహీంబేగ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు సహకరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కమిటీ సభ్యులు

డోన్ టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు సహకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు తహసీల్దార్, సీఐను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏర్పాట్లపై అధికారులకు వివరించేందుకు డోన్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు కొట్రికె ఫణిరాజ్ ఆధ్వర్యంలో సభ్యులు తహసీల్దార్ నాగమణి, సీఐ ఇంతియాజ్ బాషా, ఫైర్ ఆఫీసర్ రాజుతో పాటు మున్సిపల్ డీఈ రహూల్, ఏఈ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాను కలిశారు. విగ్రహాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జనం, రూట్ మ్యాప్ తదితర విషయాలను అధికారులకు వివరించి సహకరించాలని కోరారు.

నేడు చెరువు పరిశీలన

వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే వెంకటాపురం అబ్బిరెడ్డి పల్లె చెరువును బుధవారం ఉదయం 9 గంటలకు పరిశీలించనున్నట్లు వినాయక ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఫణిరాజ్ తెలిపారు. చెరువు పరిసరాలు, చేపట్టాల్సిన పరిశుభ్రత పనులు, భద్రతా చర్యలు తదితర విషయాలపై అధికారులతో కలిసి చెరువు ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళుతున్నట్లు చెప్పారు. సాయంత్రం 4.30 గంటలకు పాతపేటలోని రామాలయంలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు ఆంజనేయగౌడ్, జొన్నలగడ్డ శ్రీను, రమణ, హరికిషన్, హనుమంతరెడ్డి, రామకృష్ణ, సాయిరాం, రామరాజేష్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ షంషాద్‌బేగం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

డోన్ రూరల్: సమతుల్యమైన పోష్టికాహారం తీసుకోవడం బాలింతలు, గర్భిణులు, శిశువులకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం అన్నారు. పోష్టికాహార మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని చిన్నమల్కాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన శిశువు జననం తల్లి తీసుకునే పోష్టికాహారంతోనే సాధ్యమన్నారు. గర్భిణులు తీసుకునే పోష్టికాహారంతో కాన్పుల మరణాలు అరికట్టవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోష్టికాహారాన్ని తప్పనిసరిగా భుజించాలని, ఇళ్లల్లో సైతం బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శోభరాణి, వరమేశ్వరి పాల్గొన్నారు.

పోష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం

అవుకు: గర్భిణులు పోష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సైపర్‌వైజర్లు పావని, శివమ్మ అన్నారు. మంగళవారం అవుకు ముస్లిం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భం దాల్చిన నాటి నుంచి ఎంతో జాగ్రత్తగా ఉండాలని, తినే ఆహారం మొదలు చేసే ప్రతిది కడుపులోని బిడ్డపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

కడుపులోని బిడ్డ ఎదుగుదల అయ్యే కొద్ది గర్భిణులకు రక్తహీనత వస్తుందని, దీన్ని అధిగమించడానికి ప్రతి రోజూ పోష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. బాలసంజీవని కిట్‌లో ఉండే పోషకాలను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

నీటి వనరులను రక్షించాలి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డోన్ టౌన్: మండలంలోని చెరువులు, కాలువలు, కుంటలను పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గార్లపాటి మద్దిలేటిస్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మహేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నీటి పరివాహక ప్రాంతాలను ఆక్రమించడం వల్ల వరదలు, తుపాను సమయాల్లో భారీగా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతోందన్నారు. పట్టణంలో కాలువలు ఆక్రమించి భవన నిర్మాణాలు, స్కూళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించారని.. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు జనార్దన్, శేఖర్‌యాదవ్, నాగసుబ్బయ్య, గోపినాథ్‌రావ్, మహేంద్రనాయుడు, రహీం తదితరులు ఉన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

కొలిమిగుండ్ల: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారంతో ముగిసిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. సాధారణంగా రెండు రోజుల పాటు పంపిణీ చేయాల్సి ఉండగా విజయవాడలో వరదల కారణంగా ఒక్క రోజు అదనంగా పెంచారన్నారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 7103 పింఛన్లు ఉన్నాయన్నారు. 40 మంది పింఛన్లు పంపిణీ చేయలేదన్నారు. ఇందులో 28 డెత్ కేసులు ఉండగా మిగిలిన 12 మందిలో కొందరు అనారోగ్య కారణాలతో వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు అనివార్య కారణాలతో పింఛన్ తీసుకునేందుకు రాలేకపోయారు. ప్రభుత్వం పింఛన్ తీసుకునేందుకు రెండు రోజులే గడువు పెట్టడంతో ప్రతి నెలా లబ్ధిదారులు పింఛన్ తీసుకోలేకపోతున్నారు. మరుసటి నెల పింఛన్‌కు జమకాకపోవడంతో లబ్ధిదారులు నష్టపోవాల్సి వస్తోంది.

డోన్‌లో తాడిపత్రి వాసి మృతి



మృతి చెందిన సత్యనారాయణ

డోన్ టౌన్: కొత్త బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తిని ఆటుగా వెళుతున్న పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా మంగళవారం రాత్రి గమనించారు. వాహనాన్ని ఆపి ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి జేబులో ఉన్న ఓటరు కార్డు ద్వారా అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామానికి చెందిన సత్యనారాయణ(56)గా గుర్తించారు. మృతుని గురించి వాకబు చేయగా కొద్ది నెలలుగా పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్ బస్సుకు సహాయకుడిగా పని చేసినట్లు తెలిసింది. మృతున్ని గుర్తిస్తే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని పట్టణ పోలీసులు కోరారు.

మొక్కలతోనే మానవ మనుగడ



ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఈఓ

బేతంచెర్ల: మొక్కలతోనే మనవ మనుగడ సాధ్యమని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈఓ రామాంజనేయులు అన్నారు. సంఘాలకు చెందిన రాయల్ మోటార్స్ నిర్వాహకుడు రామాంజనేయులు సహకారంతో మంగళవారం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించేందుకు మొక్కలు నాటినట్టు ఆయన తెలిపారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



కలుగొట్ల సమీపంలో మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోవెలకుంట్ల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు తెగుళ్ల సోకే అస్కారం ఉందని.. సకాలంలో గుర్తించి సస్యరక్షణ చేపట్టాలని నంద్యాలకు చెందిన ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, విజయలక్ష్మి, ఇషా అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల మండలం రేవనూరు, కలుగొట్ల గ్రామాల పరిధిలో సాగు చేసిన మినుము, పెసర పంటలను పరిశీలించారు. మినుములో బూడిద తెగులు గుర్తించారు. తెగులు నివారణకు ఎకరాకు 200 గ్రాములు థయోఫనేట్ ఇథైల్ లేదా మైక్లో బుటానిల్ అనే మందును పిచికారీ చేయాలన్నారు. భారీ వర్షాలతో నిల్వ ఉన్న నీటిని పొలాల నుంచి ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. వీరి వెంట మండల వ్యవసాయాధికారి నిరంజన్, సిబ్బంది ఉన్నారు.

కందిలో ఎండు తెగులు నివారణకు చర్యలు

బేతంచెర్ల: కంది పంటలో వర్షాల వల్ల ఎండు తెగులు సోకే అస్కారం ఉందని.. రైతులు గమనించి నివారణ చర్యలు తీసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. ఎండు తెగులు సోకిన కంది పంటలో మొక్కలు ఎండిపోవడమే కాకుండా వేర్లను గమనిస్తే నల్లగా మాడిపోయి ఉంటాయన్నారు. నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ అనే మందును పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఏటా కంది పంట వేయడం వల్ల ఎండు తెగులు వస్తోందని.. ఇలాంటి పొలాల్లో జొన్న, సజ్జ, ఆముదం, పొగాకు పంటలు వేసుకుని మరుసటి ఏడాది పంట మార్పిడి చేయాలని సూచించారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ప్యాపిలి: స్థానిక బీసీ కాలనీ సమీపంలోని కలచట్ల రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని కాలనీ వాసులు, పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు ప్రతాప్, చంద్ర, వెంకటేశ్ తదితరులు కోరారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శివకుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కలచట్ల రోడ్డు వద్ద టమాట మార్కెట్ ఉన్నందున వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోందన్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు అతివేగంతో వెళ్తున్నారని.. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. అలాగే నాగుల కట్ట నుంచి గ్రామ పంచాయతీ వరకు ఉన్న కాలువలో మట్టి పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని తెలిపారు. స్పీడ్ బ్రేకర్ వేయడంతో పాటు కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని కోరారు. సుధాకర్, సురేంద్ర తదితరులు ఉన్నారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు



మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్

డోన్/డోన్ టౌన్: మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే ఆరోగ్యకర వాతావరణం సాధ్యపడుతుందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ అన్నారు. వనం.. మనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి ఆవరణ సువిశాలంగా ఉండడంతో అనేక రకాల మొక్కలను నాటి సంరక్షిస్తామన్నారు. ప్రతిఒక్కరూ మొక్కను నాటి వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు గౌస్, రమ్యశ్రీలు, విజయ, కల్యాణ్‌బాబు, హెడ్‌నర్స్ పద్మావతి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ కృష్ణయ్య, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్, అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణం రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

- డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తబురుజు పీహెచ్‌సీ ఆవరణలో డాక్టర్ రాంభూపాల్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య యాదవ్

బనగానపల్లె రూరల్: గణేష్ ఉత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేద్దామని సీఐ కృష్ణయ్య యాదవ్, తహసీల్దార్ బత్తుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విజయవాడలో వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడంతో హాజరు కాలేకపోయారన్నారు. ప్రచండ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బంగారు శీనయ్య, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు, ఆర్‌ఐ రామమేంద్ర, న్యాయవాది నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో పొగాకు పంటలో నిల్వ చేరిన వర్షపునీరు



దెబ్బతిన్న టమాట పంటను చూపుతున్న రైతు

ముంచెత్తిన వాన

కోవెలకుంట్ల: కొద్ది రోజులుగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాలు పంట పొలాలను ముంచెత్తున్నాయి. మంగళవారం సబ్‌డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 22 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 16.8, దొర్నిపాడులో 15.2మి.మీ, అవుకు మండలంలో 11.2మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంట దిగుబడులు దెబ్బతింటాయని మినుము, పెసర పంటలకు నష్టం వాటిల్లింది. పొగాకు, మొక్కజొన్న, జొన్న తదితర పంటల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అవుకులో 11.2 మి.మీ వర్షపాతం

అవుకు: మండలంలో సోమవారం నుంచి మంగళవారం వరకు 11.2 మి.మీ వర్షపాతం నమోదైందని వ్యవసాయ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి గంటన్నరపాటు భారీ వర్షం కురిసింది. చివరి దశకు వచ్చిన పంటలకు మినహా మిగతా అన్ని పంటలకు ఈ వర్షం అనుకూలమని వారు తెలిపారు. వర్షాలకు తోడు కాలువలు, రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా ఉండడంతో వరి సాగు జోరందుకుందని చెప్పారు.



అవుకులో కురుస్తున్న వర్షం

వర్షాలకు దెబ్బతిన్న టమాట

ప్యాపిలి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. పట్టణానికి చెందిన సుజాత రెండు ఎకరాల్లో టమాట పంట సాగు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింది. రూ. 80 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసే పంట పూర్తిగా దెబ్బతినడంతో నష్టపోయినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం పరిహారం మంజూరు చేయాలని రైతు సుజాత కోరుతున్నారు.

నిత్యావసర ధరలను తగ్గించాలని నిరసన

డోన్ రూరల్: పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అదాని, అంబానీలకు కొమ్ముకాస్తూ సామాన్యులపై భారం మోపుతోందని విమర్శించారు. నిత్యావసర ధరలను తగ్గించి పేదలకు సాంత్వన కలిగించాలని కోరారు. నాయకులు రాధాకృష్ణ, వెంకటేష్, వరదరాజులు, నారాయణ, హుస్సేన్ పీరా, సెమిఖ్‌బేగం, పద్మావతి, మాధవి పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

విద్యార్థినికి సన్మానం

ప్యాపిలి: గత ఏడాది రాష్ట్ర ఉన్నత పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని శ్రావణిని మంగళవారం ఘనంగా సన్మానించారు. న్యాయవాది నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమాదేవి తదితరులు మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉన్నత ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం హర్షణీయమని పేర్కొన్నారు.